ఆంధ్రభూమి, సెప్టెంబర్ 9, 1999

"తెలుపంటే నాకిష్టమే కానీ అది ఏమాత్రం కల్మషాన్ని దాచలేదని భయం. అందుకే నేను రంగుల దుస్తులు వేస్తాను. నా ముఖంలోని చిరునవ్వు కూడా రంగులు పులుముకునే ఉంటుంది-"

# డ్రై క్లీనింగ్

మనసు మనిషినంటిపెట్టుకునే ఉంటుంది కాబట్టి వంటికి కల్మషముంటే అది మనసుకూ అంటుకుంటుందని మా తాతగారనేవారు. ఆయనెప్పుడూ తెల్లని మల్లెపవ్వులాంటి బట్టలు ధరించేవారు. ఆయన నవ్వు ధరించిన బట్టలంత నిర్మలంగానూ ఉండేది.

తెలుపంటే నాకిష్టమే కానీ - ఇష్టానికి మించిన భయముంది. ఏ మాత్రం కల్మషాన్నీ అది దాచదు. అందుకే నేను రంగుల దుస్తులు వేస్తాను. నా ముఖంలోని చిరునవ్వు కూడా రంగులు పులుముకునే ఉంటుంది.

కాలేజీ రోజుల్లో యువతరమన్నాను. నవతరమన్నాను. ఆదర్శాలన్నాను. ఆశయాలన్నాను. నీతి అన్నాను. నిజాయితీ అన్నాను. బుద్ధుడు, గాంధీ వగైరాలు చెప్పినవన్నీ ప్రవచించాను.

కాలేజీ నుంచి బయటపడగానే వాటన్నింటినుంచీ బయటపడ్డాను.

లంచమిచ్చి ఉద్యోగం సంపాదించాను. కట్నం పుచ్చుకుని పెళ్ళిచేసుకున్నాను. అవినీతికి లొంగి పై మెట్లెక్కుతున్నాను. వలుకుబడికి తలవంచి వబ్బం గడుపుకుంటున్నాను.

ఇన్నీ చేస్తూ మా తాతగారి మాటలు మరిచిపోలేదు. నేనెప్పుడూ మడతనలగని ఇస్త్రీ బట్టలే వేసుకుంటాను. అదీ మా ఊరి చాకలి ఉతికి చలువ చేశాకనే!

మా చాకలిది అబ్బులు వంశమని నాకు తెలుసు, ఆయన కొడుకు కూడా అబ్బులు కావడంతో చిన్నబ్బులై ఆయన్ను పెద్దబ్బులు చేశాడు. చిన్నబ్బులికీ ఒక్కడే కొడుకు. అతడి పేరు బుల్లబ్బులు. ఇంచుమించు నా వయసువాడు. ఊళ్ళో చాకలిపనికి బొత్తిగా కిట్టడం లేదంటే పన్నెండేళ్ళ క్రితం నేనే పట్నం రప్పించాను. ఇక్కడ బుల్లబ్బులి జీవితం రంగులమయంగా వెళ్ళిపోతోంది. అతడికిప్పుడు రెండేళ్ళ కొడుకు. సంప్రదాయం

ప్రకారం అబ్బులని పేరు పెట్టాలి. కానీ పట్నంలో సంప్రదాయమేమిటిలే అని పేరు గురించి మమ్మల్నే అడిగాడు. నేను నిర్మల్ అని పేరు సూచించాను. అదే పెట్టాడు. కానీ ఇంట్లో మాత్రం వాడిని తాతా అని పిలుస్తాడు.

అబ్బులు వంశానికి, మా యింట్లో ప్రత్యేక స్థానముండేది. మడి, ఆచారాలనే మా చాదస్తపు బామ్మ కూడా శుద్ధికి ఈ వంశం మీదనే ఆధారపడేది. సమస్తకల్మషాల్నీ, మైలదోషాల్నీ అబ్బులు వంశం నివారించగలదన్న భావం చిన్నతనంలోనే నాలో బలంగా నాటుకునిపోయింది.

ఇప్పుడు పట్నంలో మా యింటి బట్టలు బుల్లబ్బులే ఉతుకుతున్నాడు. ఆ విధంగా నేను శారీరక, మానసిక కల్మషాల నుంచి విముక్తి పొందుతున్నానన్న తృప్తిలో ఉన్నాను.

బుల్లబ్బులు విషయంలో నాకున్న తృప్తి శ్రీమతికి లేదు. బుల్లబ్బులు బట్టలు సరిగ్గా ఉతకడం లేదంటుంది. అన్నవేళకు బట్టలు తేడంటుంది. రేట్లు ఎక్కువంటుంది. డ్రైక్లీనింగుకిచ్చుకుంటే అదనపు ధర బట్టల మన్నిక రూపంలో సర్దుకుపోతుందంటుంది.

భార్యాభర్తలిద్దరూ ఒక్క త్రాటి మీద నడవాలని సంప్రదాయం చెబుతుంది. కానీ నేనది నమ్మను. నిజానికి వారు ఒకటి కాదు. పార్లమెంటులో ప్రభుత్వం, ప్రతిపక్షం ఉన్నట్టే ఇంట్లో భర్త, భార్య. ప్రభుత్వం తన విధానాలకు ప్రతిపక్షం సహకారం కావాలంటుంది. ఏ దారీ తోచనప్పుడు తప్ప ఏ విధానానికీ ప్రతిపక్షాన్ని సంప్రదించదు. ప్రతిపక్షం ఏమన్నా అది బాధ్యతారహితమైన ఆరోపణ అంటుంది. ప్రతిపక్షం సహకారం లేకనే తమ విధానాలు ఫలించలేదంటుంది. విజయాలు సాధిస్తే ప్రతిపక్షం సహకరించకపోయినా తమ గొప్పతనమే ఫలితాలనిచ్చిందంటుంది. ప్రతిపక్షమూ తక్కువ తినదు.

కొన్నాళ్ళు ప్రభుత్వం ప్రతిపక్షమవుతూంటుంది. ప్రతిపక్షం ప్రభుత్వమవుతుం టుంది. స్థానాలు మారతాయి తప్పితే ప్రజాస్వామ్యం ఆ రెంటితోనూ కొనసాగవలసిందే! దాంపత్య జీవితంలో భార్యా భర్తల తీరూ అంతే!

బుల్లబ్బులికి మా కుటుంబమంటే చెప్పలేనంత యిష్టం. ఎల్లవేళలా అతడు మమ్మల్ని తెగపొగుడుతూంటాడు. నన్ను పొగిడినంతసేపూ ఫరవాలేదు కానీ మా అమ్మను మరీ ఎక్కువ పొగిడి అతను నా భార్యకు కంట్లో నలుసైపోయాడు. అందుకే ఆమె అతడి ఉతుకు బాగోలేదంటుంది. బట్టలు చింపేస్తున్నాడంటుంది. ఇంకా ఏమేమో అంటుంది.

మా ఇంట్లో ఉన్నట్టుండి శ్రీమతి పుంజుకుంది. మాకిద్దరు పిల్లలు. ఇద్దరూ తనమాటే వింటారు. పెద్దాడికి పదేళ్ళు. చిన్నదానికి తొమ్మిది. నేను బయటి వ్యవహారాల్లో తలమునకలువుతూ ఇంటి గురించి పట్టించుకోకపోవడం వల్ల అన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు లాగే నాకూ స్థానభ్రంశం వచ్చింది. ఆ విషయం నాక్కూడా తెలియకుండానే జరిగిపోయింది.

బుల్లబ్బుల్ని మా ఆవిడ పనిలోంచి తొలగించిందని తెలిసినప్పుడే నాకా స్పృహ కలిగింది. అతడు నాతో వినయంగా – "బాబూ! తాతల కాలం నుంచీ మీ ఇంట్లో

బట్టలుతుకుతున్నాం. నా పిల్లలెలాగూ కులవృత్తి చేయరు. కానీ మన బంధం నాతోనే ఆగిపోతోందని బాధగా ఉంది" అని నాతో చెప్పుకుంటే తెల్లబోయి విషయం ఆరా తీశాను.

బుల్లబ్బులు రేట్లు బాగా పెంచేశాడుట.

"గవర్నమెంటు ఉద్యోగుల జీతం అప్పటికీ ఇప్పటికీ యాభైరెట్లు పెరిగింది. నేను పెంచిందెంత బాబూ?" అన్నాడు బుల్లబ్బులు.

అతగాడి మాటల్లో నిజమున్నదనిపించింది.

నాతో శ్రీమతి ఎక్కువ వాదించలేదు. "అయితే నేను ఇంత వండి పారేస్తాను, ఈ ఇల్లు మీరే నడపండి" అంది.

ఇల్లు నడపడమంటే అపరాలు, కూరలు తేవాలి. పనివాళ్ళకు జీతాలివ్వాలి. పిల్లల స్కూలు జీతాలు, రిక్షా డబ్బులు వగైరాలన్నీ చూడాలి. జాబితా తిరగేసి చూస్తే రోజుకు ఇరవై నాలుగ్గంటలు చాలవు.

ఇంతకాలం ఇల్లు నేను నడుపుతున్నాననుకున్నాను. ప్రభుత్వం శ్రీమతి చేతుల్లోకి వెళ్ళిపోయిందని అప్పుడు నాకు అర్థమైంది. అయినా ఓ వృథా ప్రయత్నం చేస్తూ బుల్లబ్బుల్ని తీసేస్తే ఉండే యిబ్బందులు చెప్పాను.

"ఇంట్లో పనిమనిషి కొన్ని బట్టలుతుకుతుంది. మిగతావి డ్రైక్లీనింగుకు వేస్తాం. శుభ్రానికి శుభ్రం. సుఖానికి సుఖం. డబ్బుకు డబ్బు ఆదా" అంది శ్రీమతి.

అధికారం చేతిలో ఉంటే పలికింది వేదవాక్కు. వదిలింది రామబాణం. అక్కడ తర్కంతో నిమిత్తముండదు.

బుల్లబ్బులుకు ఉద్వాసన జరిగింది. వెళ్ళేముందు అతగాడు, "నలుగురికీ చెప్పిన ధరే మీకూ చెప్పాను - మీరు నొచ్చుకుంటారని. ధర పెంచానని నన్ను తీసేశారు కానీ మీకైతే ఉత్తినే ఉతకమంటే ఉతకనా?" అన్నాడు.

ఆ మాటలు పదే పదే తల్చుకుని నేను బాధపడితే, "పనిలోంచి తీసేసేదాకా మన విలువ అతగాడికి తెలియలేదు. ఇంట్లో మనిషిలా చూసుకున్నాం. శుభకార్యాలకు కట్నాలిచ్చాం. ఆడపా దడపా బట్టలిచ్చాం. పండుగలకూ, పబ్బాలకూ పిండివంటలు పెట్టాం. విశ్వాసం లేదు" అని శ్రీమతి ఛీత్కరించింది. అది నా సెంటిమెంటుకు బదులని నాకు అర్థమయింది.

పిల్లలిద్దరూ స్కూలుకు వెళుతున్నారు. వాళ్ళకు యూనిఫాం రోజూ ఉతకాలి. అందుకని చెరో ఏడెనిమిది జతలు కుట్టించేవాళ్ళం. బుల్లబ్బులు యూనిఫాంలు వారానికి రెండుసార్లు ఉతికి తెచ్చేవాడు. ఇప్పుడు శ్రీమతి పోలీయెస్టర్ యూనిఫాంలు కొత్తగా కుట్టించింది. ఒక్కొక్కరికి రెండేసి జతలు. వాటిని పని మనిషే ఉతుకుతోంది. ఇస్త్రీ పిల్లలే చేసుకుంటున్నారు.

నా బట్టలు, తనూ పిల్లలూ బైటకు వేసుకునే బట్టలూ శ్రీమతి డ్రై క్లీనింగుకు ఇచ్చేది. అక్కడ ధర బాగా ఎక్కువే కానీ శ్రీమతి మరో విధంగా సమర్థించింది.

బుల్లబ్బులుతికిన బట్టలు ఒక్కసారి ధరించగానే మళ్ళీ ఉతికించాల్సి వచ్చేది. డ్రైక్లీనింగు బట్టలు చాలాసార్లు వేసుకోవచ్చుట.

"అది రెండు విధాల లాభం. ఒకటి - చీటికీ మాటికీ చాకలి చుట్టూ తిరగనవసరం లేదు. రెండు - ఉతుకులు తగ్గడం వల్ల బట్టల మన్నిక పెరిగిపోతుంది" అంది శ్రీమతి.

నాకు తెలిసి - బుల్లబ్బుల్ని తీసేసినప్పట్నించీ మాకు ఉతుకుడు ఖర్చు అన్ని వైపుల్నించీ పెరిగింది. ఇంట్లో వాషింగు పౌడరు బాగా ఎక్కువగా కొనాల్సి వస్తోంది. డ్రైక్లీనింగు నెల ఖర్చు బాగా పెరిగింది. ఇదికాక బట్టలెక్కువైతే పనిమనిషి సణుగుడు. ఆ సణుగుడు తగ్గించడానికివ్వాల్సిన లంచాలు. అంతేకాదు - డ్రైక్లీనింగుకు చౌకరకం బట్టలు వేస్తే చిన్నతనంగా ఉంటుంది. అందుకని ఇప్పుడు మేముకొనే బట్టలు కూడా గతంలో కంటే బాగా ఖరీదైనవి.

డబ్బుకు సంబంధించినంతవరకూ ఈ ఇబ్బందుల్ని తట్టుకోగల స్థితిలోనే ఉన్నాను నేను. కానీ శ్రీమతి పార్టీలోనే జయలలితలు పుట్టుకొచ్చారు.

పనిమనిషి ఉతికితే బట్టలు మురికిపోవడంలేదు. బట్టలు ఇస్త్రీ చేసుకోవాలంటే టైము చాలడం లేదు. డ్రైక్లీనింగు షాపుకి వెళ్ళడం, రావడం చాలా ఇబ్బందిగా ఉంది.

తలకు మించిన హోం వర్కుతో బాధపడుతున్న పిల్లలు చేసిన ఫిర్యాదులివి. వాటిని తల్లి లెక్కచేయక పోగా వాళ్ళు నా దాకా వచ్చారు.

నేను సౌమ్యంగానే శ్రీమతి వద్ద పిల్లలపాట్ల సానుభూతిని ప్రకటించాను.

"నేను మాత్రం ఎన్ని పనులని చేయను? అప్పటికీ వీలున్నపుడల్లా ఇస్త్రీలు నేనే చేస్తున్నాను. పనిమనిషి ఉతికినవి మళ్ళీ ఉతుకుతున్నాను. డ్రైక్లీనింగు షాపుకి వెడుతున్నాను. డబ్బు ముఖాన కొడితే సరిపోతుందా - కొన్ని పనులు మీరూ చేయాలి" అంది శ్రీమతి.

"కొన్నాళ్ళు బుల్లబ్బుల్ని పెట్టుకుని చూద్దాం - అప్పుడు అవసరమనిపిస్తే నువ్వు చెప్పిన పనులన్నీ నేను చేస్తాను" అన్నాను.

"బుల్లబ్బులు...బుల్లబ్బులు...మీకు పెళ్ళాంకంటే అతడే ఎక్కువా?" అంది శ్రీమతి.

"ఇప్పుడు నాకు మా అమ్మానాన్నల కంటే కూడా నువ్వే ఎక్కువ. నేనాలోచించేదంతా నీ సుఖం కోసమే" అంటూ శ్రీమతికి కల్మషం గురించి నా అభిప్రాయాలు చెప్పి అవి బుల్లబ్బులు వల్లనే పోతాయనీ - ఇటీవల మా ఇంట్లో అందరికీ చిరాకులు పెరగడానికి డ్రైక్లీనింగే కారణమనీ చెప్పాను.

అమ్మానాన్నల కంటే తనే ఎక్కువన్నానని శ్రీమతికి నా మీదున్న చిరాకంతా పోయింది. ఆమె కూడా సానునయంగా బుల్లబ్బులు లోపాలు చెప్పింది.

"మైలశుద్ధి పాతకాలపు మాట. ఇప్పుడు మనం పీల్చేగాలిలో మోటారు వాహనాలొదిలే కలుషిత వాయువులున్నాయి. తినే తిండిపై కృత్రిమ రసాయనాలుంటున్నాయి. తాగే నీటిలో పరిశ్రమల కాలుష్యాలున్నాయి. అడుగడుగునా కాలుష్యం. దానికి అలవాటు పడి జీవించడమే ఆధునికత, సంప్రదాయం. ఇంతకీ బుల్లబ్బులు

బట్టలుతికేది మురికి గుంటలోనని మీకు తెలుసుకదా" అందామె. ఆమె డిగ్రీలో సైన్సు స్టూడెంటు.

"నీ ఇష్టం - నీ సుఖం కోసమే నేను చెప్పాను. నన్ను మాత్రం ఇంటి పనుల్లోకి లాగకు. అడిగిన డబ్బిచ్చుకుంటాను" అన్నాను రాజీకి వస్తూ.

నా రాజీ ధోరణి శ్రీమతిలో మార్పును తెచ్చింది. ఎప్పుడైతే నేనామెను తప్పుపట్టడం మానేశానో ఆమె తన తప్పును గురించి తనే ఆలోచించసాగింది.

డబ్బు ఖర్చు పెరిగింది. ఇంట్లో బట్టల ఉతుకు బాగుండడం లేదు. నిజం చెప్పాలంటే డ్రైక్లీనింగులోనూ అంత బాగుండడం లేదు. చిన్న మచ్చ ఉంటే అదనపు ధర. చిన్న చిరుగుంటే దార్నింగంటారు. అదీకాక అన్న తేదీకి బట్టలివ్వరు. ఏవేవో కారణాలు చెబుతారు. అలాగే ఒకసారి నేనూ శ్రీమతీ డ్రైక్లీనింగు షాపుకి వెళితే, "వారం రోజుల్నించి ఒకటే వాన" అన్నాడు.

"డ్రై క్లీనింగ్ కదా - వానైతేనేం?" అన్నాను ఆశ్చర్యంగా.

అతడేదో బదులివ్వబోగా ఫోను మోగింది. రిసీవర్ తీసుకుని - "అమ్మగారూ, నమస్కారం. ఏమిటన్నారూ - నేతిబీరకాయ, పెరుగుతోట కూరానా? అవి అయ్యగారి కిష్టమంటారా? వచ్చేటప్పుడు దార్లో కూరల దుకాణంలో కొని తెస్తానండి. ఉంటానండి?" అని ఫోన్ పెట్టేశాడు. తర్వాత నా వంక చూసి "మీరేదో అడిగినట్టున్నారు" అన్నాడు.

"జవాబిచ్చేశావుగా" అన్నాను నిర్లిప్తంగా.

శ్రీమతి మాత్రం "డ్రైక్లీనింగంటారు. వానంటారు. అన్నరోజుకు బట్టలివ్వరు. ధర చూస్తే చాలా ఎక్కువ...." అని ఏదో అనబోయింది.

"సార్ బట్టలు తెచ్చినట్టున్నారు..." అన్నాడు షాపువాడు నావైపు చూస్తూ.

"బట్టలు తీసుకుని ఇద్దామనుకున్నాను" అన్నాను.

"ఇచ్చేయండి సార్. రేపటినుంచి రేట్లు పెరుగుతున్నాయి. పాత ధరలు ఈరోజు దాకానే..." అన్నాడు షాపువాడు. అది శ్రీమతి మాటలకు బదులులా ఉంది.

శ్రీమతికి రావలసినంత ఉక్రోషమూ వచ్చింది. ఆమె నన్ను బట్టలివ్వనివ్వలేదు. ఆవేశంగా ఇల్లు చేరుకున్నాక, "ఇక లాభం లేదు. మనం వాషింగ్‌మెషీన్ కొనుక్కుందామండీ" అంది.

నేను శ్రీమతిని సముదాయించి, "మామూలు వాషింగ్ మెషీన్ కొనుక్కుంటే నీకు పనేమీ తగ్గదు. ఆటోమేటిక్‌ది కొనుక్కుంటే బాగుంటుంది. బజార్లో దాని ధర పద్దెనిమిది వేలదాకా ఉంది. మంచి కంపెనీ అయితే. ఆ డబ్బును సరైన చోట డిపాజిట్ చేస్తే ఏడాదికి రెండువేల నాలుగొందలు వస్తుంది. అంటే నెలకు రెండొందలు. ఆ డబ్బులే బుల్లబ్బులకిస్తే మనిషికి దారి చూపినట్లవుతుంది. మెషీన్ కొంటే ఉత్తినే అవుతుందా... దానికి కరెంటు అవుతుంది. పౌడర్లు కావాలి. మరమ్మత్తులుంటాయి" అన్నాను.

ఏ కళ నుందో శ్రీమతి ఆలోచనలో పడింది. అది గమనించి నేను పుంజుకుని

– "ఆధునికత సదుపాయాల్లోనే తప్పు ఆలోచనల్లో లేదు. అమెరికాలో సూపర్ బజార్లలాగే సూపర్ ఆలయాలు కడుతున్నారు. అంటే అందరు దేవుళ్ళూ ఒకే ఆలయంలో ఉంటారు. కాసెట్లు వస్తే పూజలు చేసుకుంటున్నాం. కంప్యూటర్ వస్తే జాతకాలు చూసుకుంటున్నాం. సంప్రదాయం ఎక్కడికీ పోదు. అది మనతోనే ఉంటుంది. తర్కంలోంచి పుట్టిన సైన్సు కూడా తర్కానికి లొంగని సంప్రదాయానికి సేవలు చేస్తూంటుంది. కాబట్టి నువ్వు సంప్రదాయాన్ని నమ్ము. బుల్లబ్బులి సేవలు అందుకో" అన్నాను.

శ్రీమతి కాదనలేదు. ఆ ధైర్యంతోనే నేను బుల్లబ్బులి కోసం కబురు పెట్టాను. అతడు తీరుబడి లేదని రెండు మూడు రోజుల తర్వాత వచ్చాడు. నేను మళ్ళీ మా ఇంట్లో బట్టలుతకడం మొదలు పెట్టాలని చెప్పాను. ఆ విధంగా సంప్రదాయాన్ని పునరుద్ధరించాలన్నాను.

"ఇళ్ళల్లో బట్టలుతికితే కిట్టడం లేదు బాబూ! నేనిప్పుడు డ్రైక్లీనింగ్ షాపుకి బట్టలుతుకుతున్నాను. వాళ్ళు నాకు రెట్టింపు డబ్బులిస్తున్నారు. ఆ డ్రైక్లీనింగ్‌షాప్‌లో మీ బట్టలివ్వండి. సంప్రదాయం పాటించినట్టే" అన్నాడు బుల్లబ్బులు.

అటు శ్రీమతి – ఇటు నేనూ కూడా ఖంగుతిన్నాం – కారణాలు వేరైనా, ఆ కారణాలకు మూలం మాత్రం ఒక్కటే – అంతకాలం మేము క్లీనింగుకు బట్టలిస్తున్నది బుల్లబ్బులు పనిచేస్తున్న డ్రైక్లీనింగు షాపే! ముఖం చూస్తే బుల్లబ్బులికా విషయం తెలిసినట్టే ఉంది.

✦ ✦ ✦